
# కాంగ్రెస్ అభ్యర్థి కీలుబొమ్మ

- ఆయన గెలిస్తే ఏం కావాలన్నా అడుక్కోవాల్సిందే..
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పింఛన్ పెంపు
- సన్నబియ్యం, పేద మహిళలకు నెలకు రూ.3వేలు
- రూ.400కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15లక్షలకు పెంపు
- మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



రైతురాజ్యం వ్యవస్థాపక అధ్యక్షుడు మంగీలాల్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు, నవంబర్ 5 : మహబూబాబాద్‌లో పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే బాంఛన్ దొర.. అంటూ గడీల పాలనలో బతకాల్సివస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయన గూడూరు మండలంలోని లక్ష్మీపురం, అప్పిరాజుపల్లి, జంగుతండా, గండీతండా, మధనాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ, తనను ఆశీర్వదించాలని కోరారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల ప్రభుత్వాన్ని అందరూ దీవించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పే గ్యారెంటీ లేని పథకాలకు ప్రజలు ఆగం కావొద్దని, పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే మహబూబాబాద్‌లో బాంఛన్ దొర అంటూ బతకాల్సి వస్తుందన్నారు. ఆ పార్టీ అభ్యర్థి ఓ దొర చేతిలో కీలుబొమ్మని, మళ్లీ మనం దొరల పాలనలో గడీల పాలకులకు దాసోహం కాకూడదన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్, 24 గంటల విద్యుత్ వంటి పథకాలు పేదల ప్రజలకు ఎంతో మేలు చేశాయన్నారు. దేశంలో ఏ పాలకుడు, ఏ ప్రభుత్వాలు గతంలో కానీ, ఇక ముందు కానీ అమలుచేయ అలవిగాని పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని, అందుకే రాష్ట్రం అన్ని రంగాల్లో ముందున్నదని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే పేదింటి మహిళకు నెలకు రూ.3వేలు, సన్నబియ్యం, ఆసరా పింఛన్లు రూ.5వేలకు పెంచి అండగా నిలుస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని, మానుకోట గడ్డ మీద గులాబీ జెండా ఎగురుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

### రైతు రాజ్యం వ్యవస్థాపక అధ్యక్షుడి చేరిక

లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు రాజ్యం వ్యవస్థాపక అధ్యక్షుడు బానోత్ మంగీలాల్ బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కండువా కప్పి పార్టీకిలో ఆహ్వానించారు. తన పార్టీని బీఆర్ఎస్‌లో వీలినం చేస్తున్నట్లు మంగీలాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంగీలాల్ గొప్ప నాయకుడని, ఆయన సేవలు పార్టీకి చాలా అవసరమన్నారు. మంగీలాల్ చేరికతో పార్టీ మరింత బలోపేతమైందన్నారు. లక్ష్మీపురం గ్రామ నాయకుడు కోడి రవి ఆధ్వర్యంలో ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి ఎమ్మెల్యే శంకర్‌నాయక్ బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్ రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఖాసీం, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, సంపత్‌రావు, సర్పంచ్‌లు రామ్మూర్తి, రణధీర్‌రెడ్డి, ముక్కా లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షులు కోడి రవి, కె. వేణుమాధవ్‌రెడ్డి, నర్సింహానాయక్, సత్యం, హచ్చునాయక్, రవినాయక్, రామమల్లు, శ్రీనివాస్, పాండ్య, చందర్, వేముల రవీందర్, వీరన్న, రవియాదవ్, పైండ్ల ప్రభాకర్, బోడ ఎల్లయ్య, నవీన్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే సీఎం కేసీఆర్ లక్ష్యం

- పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం
- ఒంటరి మహిళలు, వృద్ధులకు అండగా ఆసరా
- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మరిపెడలో మహిళలతో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ, నవంబర్ 5 : మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతున్నదని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ స్పష్టం చేశారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం ఆయన 5, 6వ వార్డులో స్థానిక కార్యకర్తలు, మహిళలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశారని తెలిపారు. ఇంటింటికీ సన్నబియ్యం, రూ.400కే వంట గ్యాస్, ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులకు రూ.5016 ఆసరా పింఛన్, దివ్యాంగులకు రూ.6016, సౌభాగ్య లక్ష్మీ పథకం ద్వారా పేద మహిళలకు రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం, మహిళా సంఘాలకు సొంత భవనాలు, ఇంటింటికీ రూ.5లక్షల కేసీఆర్ బీమా తదితర పథకాలు అందజేయనున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో పల్లె, పట్టణాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. మిషన్ భగీరథ వాటర్, నిత్యం పారిశుధ్య పనులతో సీజనల్ వ్యాధులు దాదాపు దూరమయ్యాయని, పరిశుభ్రతలో తెలంగాణ పల్లెలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందాయన్నారు. దశాబ్దాల తరబడి తెలంగాణను పాలించిన కాంగ్రెస్ పార్టీ మహిళల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరంలా మారిందన్నారు. కేసీఆర్ కిట్, తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదన్నారు. నిత్యం ప్రజలమధ్య ఉంటూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న తనకు ఇవే చివరి ఎన్నికలని, ఓటరు దేవుళ్లు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, రామడుగు అచ్చుత్‌రావు, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర, ఎంపీపీ గుగులోత్ అరుణారాం బాబు, జడ్పీటీసీ తేజావత్ శారదారవీంద్రనాయక్, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# గిరిజనులు రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలి

**జిల్లా సమన్వయ కర్తలు అజ్మీరా సీతారాంనాయక్, నూకల నరేశ్‌రెడ్డి**

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 5 : గిరిజనులను అవమానపరుస్తున్న కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎంపీ, జిల్లా సమన్వయకర్త అజ్మీరా సీతారాంనాయక్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా సమన్వయ కర్త నూకల నరేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎ మ్మెల్యే పాత క్యాంపు కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సారా పోసి డబ్బులు ఇస్తే లంబాడాలు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తారని కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అహంకారంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులను చిన్న చూపు చూడడం సరైందని కాదన్నారు. గిరిజనులందరూ ఏకమై కాంగ్రెస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. గత పాలకులు గిరిజనుల కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట మీద ఉండి రాష్ట్రంలోని 3,146 తండాలు, గూడేలను ప్రత్యేక జీపీలుగా చేయడం వల్లే నేడు గిరిజనులు సర్పంచ్‌లయ్యారని అన్నారు. రాజ్యాంగ ఫలాలు గిరిజనులకు అందాలనే ప్రధాన లక్ష్యంతోనే కేసీఆర్ 6 శాతం ఉన్న రిజర్వేషన్లను పదిశాతానికి పెంచినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే మానుకోట రూపురేఖలు మారాయని, మెడికల్, నర్సింగ్, ఉద్యాన కళాశాలల ఏర్పాటుతో ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నా రు. రేవంత్‌రెడ్డి కులాలు, మతాల చిచ్చు పెట్టేవిధంగా మా ట్లాడడం సరి కాదన్నారు. గ్రామాల్లో వస్తున్న కాంగ్రెస్ నా యకులను ఏం అభివృద్ధి చేశారో నిలదీయాలన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ఓటడిగే అర్హత లేదని, రాష్ట్రం మరింత అభివృద్ధి చేయాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో గిరిజన ప్రజాప్రతినిధుల ఆత్మీ య సమ్మేళనం ఉందని, ప్రతి గిరిజన బిడ్డా పా ల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, పట్టణ అధ్యక్షుడు గద్దె రవి, గోగుల రాజు, వెంకన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పోడు భూములకు పట్టాలు ఇచ్చినందుకు కృతజ్ఞతగా నాగజ్యోతికి ధన్యవాదాలు తెలుపుతున్న రాయినిగూడెం మహిళలు

# కేసీఆర్ ప్రజల పక్షం

- తెలంగాణ ప్రజలను ఆదుకున్నది.. సాదుకున్నది ఆయనే..
- నాడు ప్రభాకరన్న పోడు చేయిస్తే.. నేడు బీఆర్ఎస్ పట్టాలిచ్చింది
- తుది శ్వాస వరకు ప్రజా సేవకే అంకితం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

ములుగురూరల్, నవంబర్ 5 : ఢిల్లీ పీఠాన్ని కదిలించి స్వరాష్ట్రాన్ని సాధించిన అనంతరం తెలంగాణ ప్రజలను ఆదుకున్నది, సాదుకున్నది సీఎం కేసీఆరే అని ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. ఆదివారం ములుగు మండలంలోని 12 గ్రామాల్లో రెడ్కో చైర్మన్, మండల ఎన్నికల ఇన్‌చార్జి ఏరువ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగజ్యోతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంకన్నగూడెం, జగన్నగూడెం, లాలాయిగూడెం, సర్వాపురం, రాయినిగూడెం, పెగడపల్లి, దుబ్బగూడెం, కొత్తూరు, పంచోత్కులపల్లి, కాసిందేవిపేట, రామయ్యపల్లి, కన్నాయిగూడెం, రాంనగర్‌తండా, బరిగలానిపల్లి, ఇంచర్ల, బంజరుపల్లి, జంగాలపల్లి గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారంలో పాల్గొన్నారు. అంకన్నగూడెంలో బాలకుమారస్వామిని, రాయినిగూడెంలో గుట్టమీది ముసలయ్య దేవుళ్లను దర్శించుకున్నారు. సర్వాపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆయా గ్రామాల్లో నాగజ్యోతి మాట్లాడుతూ నాడు తన తండ్రి బడే నాగేశ్వర్‌రావు అడవి బాట పట్టి పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేశారన్నారు. ప్రభాకరన్న పోడు భూములకు యజమానులను చేస్తే నేడు తండ్రి సమానులైన సీఎం కేసీఆర్ పోడు రైతులకు పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆటంకాలు కలిగించినా ఇచ్చిన మాట ప్రకారం పట్టాలు అందించారన్నారు. మరి కొంత మంది గిరిజన రైతులకు పోడు పట్టాలు రావాల్సి ఉందని, వారందరికీ ఎన్నికల అనంతరం ఇవ్వనున్నట్లు చెప్పారు. గిరిజన రైతులతో పాటు గిరినేతులకు పోడు పట్టా లు, అసైండ్ భూములను సాగు చేసుకునే వారికి సైతం హక్కులు కల్పించే విధంగా మ్యానిఫెస్టోలో కేసీఆర్ పొందుపర్చారని గుర్తు చేశారు. ములుగు దవాఖానను అప్‌గ్రేడ్ చేసి టీ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సేవలను మెరుగుపర్చారన్నారు. గతంలో డెవలరీకి వెళ్లాలంటే వరంగల్ ఎంజీఎంకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం అలాంటి కష్టాలు లేవన్నారు. మల్లంపల్లి మండ లం, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, మంగపేటలో ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ములుగు లో మెడికల్ కళాశాల, ప్రభుత్వ దవాఖాన మంజూరైందని తెలిపారు. మన పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన కొనసాగుతున్నదని, అక్కడి ప్రజలు నీళ్ల, కరెం ట్, సంక్షేమానికి అరిగోస పడుతున్నారన్నారు. ఉద్యమం సమయంలో తెలంగాణను అవహేళన చేసిన నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి బుద్ధిచెప్పిన ఘనత రాయినిగూడేనికి ఉందన్నారు. నా తల్లి దండ్రులు బడే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకరన్న, బడే పుష్పక్క అలియాస్ రాజేశ్వరీ నక్సల్ ఉద్యమంలో ప్రజల కోసం సేవ చేసి అసువులు బాసారో అదే రీతిలో ప్రజల సేవ చేసేందుకు రాజకీయంగా తాను ముందుకు వచ్చానన్నారు. తుది శ్వాస వరకు ప్రజా సేవకే అంకితమవుతానన్నారు.

### కష్టమంటే ఏంటో నాగజ్యోతికి తెలుసు

*– బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు*

చిన్న తనం నుంచి ప్రజల కష్టాలు, గ్రామాల్లో నెలకొన్న ఇబ్బందులు, పేదరికం ఎలా ఉంటుందో తెలిసిన నాయకురాలు నాగజ్యోతి అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. తల్లిదండ్రులు ప్రజల కోసం బుల్లెట్ మార్గాన్ని ఎంచుకుంటే ఆమె బ్యాలెట్ మార్గాన్ని ఎంచుకొని రాజకీయ ప్రవేశం చేశారని తెలిపారు. పేదింటి ఆడబిడ్డ నాగజ్యోతిని సీఎం కేసీఆర్ జడ్పీ వైస్ చైర్మన్‌గా, చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించి ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపి ములుగు నియోజకవర్గ ప్రజల ముందు ఉంచారని తెలిపారు. ప్రజలు నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీటీసీ మాసిపెద్ది పుష్పమ్మ సత్యనారాయణరావు, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, మాజీ ఎంపీపీ మస్రగాని వినయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, గ్రామ కమిటీ అధ్యక్షులు తక్కళ్లపల్లి రామారావు, అప్పాజి అయిలయ్య, ఆవుల ఐలయ్య, సర్పంచులు చింత శ్యామల, మాలోత్ రవీందర్, మస్రగాని అనిత, మోరె రాజయ్య, లత, ఎంపీటీసీలు పోరిక విజయ్‌రామ్‌నాయక్, పూజారి రమాదేవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.